క్లుప్తంగా

12న నవోదయ మోడల్ పరీక్షలు

డుంబ్రిగుడ: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 12న నవోదయ మోడల్ పరీక్షలను అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జి.గెన్ను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడమే ప్రధాన లక్ష్యంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అనకాపల్లి జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపీనాథ్ ఆదేశాల మేరకు ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నవోదయ మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గిరిజన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

హుకుంపేట: దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారని మండలంలోని మఠం సర్పంచ్ శాంతకుమారి అన్నారు. జాతీయ మహిళ కమిషన్, కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ సంయుక్తంగా ఈ నెల 5,6 తేదీల్లో నిర్వహించిన పంచాయతీ టూ పార్లమెంట్ సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని 22 రాష్ట్రాల్లోని వివిధ తెగలకు సంబంధించిన సుమారు 500 మంది గిరిజన మహిళ ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో పాల్గొవడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పీసా కమిటీ తదితర అంశాలపై చర్చించినట్టు తెలిపారు. గిరిజన మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

చింతపల్లి: బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో చింతపల్లి ఐసీడీఎస్ పీవో రమణి ఆధ్వర్యంలో బాల్యవివాహాల నియంత్రణపై శుక్రవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఎంఈవో ప్రసాద్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు విజయకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గంగవరం: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ కిశోర బాలికల వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భావన, ఎంఈవో మల్లేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం



లోదొడ్డిలో రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషా, నాయకులు

రాజవొమ్మంగి: మండలంలోని కిమ్మిలిగెడ్డ నుంచి ముర్లవానిపాలెం గ్రామానికి, అలాగే లోదొడ్డి నుంచి కిండంగి వెళ్లే రహదారి పనులకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. వట్టిగెడ్డలో గోశాలను ఆమె ప్రారంభించారు. తంటికొండ సర్పంచ్‌లు రామారావు, శుభలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు, నాయకులు విజయభాస్కర్, సావిత్రి, సాంబకేశవరావు తదితరులు పాల్గొన్నారు.



సంతలో కుండల అమ్మకాలు



గాజులు కొనుగోలు చేస్తున్న గిరిజన మహిళలు



సంతలో విక్రయానికి తీసుకొచ్చిన మేకలు

సంతకు పండగ కళ

- దుస్తులు, నిత్యావసరాల అమ్మకాలు
- బుడియాల సందడి

డుంబ్రిగుడ: డుంబ్రిగుడ, అరకులోయ మండలాలతో పాటు సరిహద్దు ఒడిశా రాష్ట్రం పాడువా, చటువా, పుక్కలి, పొట్లాంగి తదితర వాసులకు ప్రధానమైన ముఖ్య సంతలో అరకు సంత ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. గిరిజనుల సూపర్ మార్కెట్‌లు వారపు సంతలలో శుక్రవారం సంక్రాంతి శోభ ఉట్టిపడింది. పండగ సంత కావడంతో గిరిజనులతో కిక్కిరిసిపోయింది. వస్త్ర దుకాణాలు, కిరాణా దుకాణాలు, సంప్రదాయ వాయిద్యాలు, గాజులు దుకాణాలు, మట్టి కుండల దుకాణాలు కిక్కిరిసాయి. దర్జీల వద్ద దుస్తులు కుట్టించుకునేందుకు గిరిజనులు బారులు తీరారు. ప్రతి వారం నిర్వహించే వారపు సంత సుమారు లక్షలాది రూపాయల టర్నోవర్‌తో జరుగుతుంది. ఈ వారం ప్రధాన పండగ సంక్రాంతి సంత కావడంతో గిరిజనులు అధిక సంఖ్యలో సంతకు వచ్చి సుమారు రూ.2 కోట్లు వరకు వ్యాపారం చేశారు. గిరిజనులు యొక్క ప్రధాన పంటలైన కాఫీ, మిరియాలు, అల్లం, పసుపు వంటి ఉత్పతులు సంతలో అమ్మకాలు జరిగాయి. కుటుంబంలో ప్రతి ఒక్కరికి వస్త్రలతో పాటు గృహ వస్తువులు, కొనుగోలు చేశారు. పండగను పురస్కరించుకొని బుడియాలు విచిత్ర వేషధారణతో సందడి చేసి, చందాలు వసూలు చేశారు.



కిటకిటలాడుతున్న వారపు సంత

మేకలకు గిరాకీ

అరకు వారపు సంతలో మేకలకు గిరాకీ లభించింది. ఒక్కో మేక సుమారు రూ.8వేల నుంచి రూ.12 వేల వరకు అమ్మకాలు జరిగాయి. కొంతమంది గిరిజనులు పండగ అవసరాల నిమిత్తం మేకలను విక్రయించారు. వారపు సంతలో సంక్రాంతికి ముఖ్యంగా సంప్రదాయ వాయిద్యాలకు గిరాకీ లభిస్తుంది. ఒడిశా రాష్ట్రం నుంచి ఇక్కడ వారపు సంతలో తీసుకువచ్చి గిరిజనులు విక్రయిస్తున్నారు. ఒక్క తుడుమ్ రూ.2500లు కాగా, డప్పు రూ.1500లు, కిరిడి రూ.700 నుంచి రూ.1000ల ధరలు పలికాయి. ఒక్కో కుండ పెద్దది రూ.220లు కాగా, చిన్నవి వాటి పరిమాణం బట్టి ధరలు లభించాయని గిరిజనులు తెలిపారు.



సంతలో బుడియాలు



దుస్తులు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

ధరలు పెరిగాయి



ధరలు బాగా పెరిగాయి. గత సంక్రాంతి పండుగతో పోల్చుకుంటే నిత్యావసరాలతో పాటు కొత్త దుస్తుల ధరలు పెరిగాయి. నేను 50 కిలోల కాఫీ అమ్మగా, వచ్చిన సుమారు రూ.15 వేలతో నా కుటుంబానికి సంక్రాంతి పండుగకి దుస్తులు కొన్నాను. ప్రస్తుత పెరిగిన ధరలకు రూ.15 వేలు పెట్టినా సరిపోవడం లేదు.

– గొల్లోరి, దయానిధి, బోడిగుడ పోతంగి పంచాయతీ



వాయిద్యాల అమ్మకాలు

సంతలే ప్రధానం



ఏటా పండుగకు వారపు సంతలోనే మా పిల్లలకు, పెద్దలకు దుస్తులు, వివిధ కిరాణా వస్తువులు కొనుగోలు చేస్తాం. ఈ వారపు సంత మాకు పూర్వం నుంచి ఉన్నది. ప్రతి వస్తువుకి ఇక్కడ మేము కొనుగోలులో ధరలు తగ్గిస్తారు. అయితే పేరుగుతున్న ధరలతో కొంత అధిక ధరలు ఉన్నాయి అయినా వారపుసంతలే మాకు ముఖ్య పండుగ సంతలు.

– వంతల టికేమ్, లంతంపాడు గ్రామం, సిరగం పంచాయతీ, అరకులోయ మండలం

వ్యాపారం బాగుంది



నేను ఒడిశా రాష్ట్రం పాడువ వద్ద ఉన్న లువసింగి గ్రామం నుంచి తుడుములు, డప్పులు, కిరిడిలు ప్రతి వారం తీసుకువచి అమ్ముతాను. అయితే సంక్రాంతి పండుగ సంత కావడంతో ఈ వారం కొన్ని ఎక్కువ వాయిద్యాలు తీసుకు వచ్చాను. లాభాం బాగుంటుంది. తోలుతో చేసే వాయిద్యాలకు మంచి గిరాకి ఉంటుంది.

– కిల్లో సొన్య కులసింగి, ఒడిశా రాష్ట్రం

క్యాలెండర్ ఆవిష్కరణ



చింతపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీహెచ్ఏఎంఎస్ఏ) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి తదితరులు ఆవిష్కరించారు. పలువురు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, జాన్సన్, కన్నబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గోపూజ ప్రచార పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయం కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నర్సింగరావు

పాడేరు రూరల్: ఈనెల 15న నిర్వహించనున్న గోపూజ ప్రచార పోస్టర్‌ని వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నర్సింగరావు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు తరలివచ్చి పాల్గొవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామశాస్త్రి, కమిటీ సభ్యులు వెంకటరత్నం, రామారావు, వెంకటరమణ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

- భక్తులతో కళకళలాడిన ఆలయాలు
- మార్మోగిన గోవింద నామస్మరణ



రాజవొమ్మంగిలో ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి



పవనగిరి క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయాల బయట బారులుతీరారు. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో భక్తులకు ఉత్తరద్వారం దర్శన ప్రవేశం కల్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రాలతో ఉత్తరద్వారం తెరవడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయంలోకి ప్రవేశించి స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గోవింద నామస్మరణతో గ్రామాలన్నీ మార్మోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగిన సౌకర్యాలు కల్పించారు.

రంపచోడవరంలోని నారాయణగిరిపై ఉన్న ద్వారకా తిరుమల దత్తత దేవాలయం వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులతో కలిసి రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం దంపతులు, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

అడ్డతీగల: అడ్డతీగలలోని సాయి సత్సంగం, సాయి భజన మండలి సభ్యులతో పాటు భక్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తన నిర్వహించారు.



రంపచోడవరంలో భక్తులతో కలిసి పూజలు చేస్తున్న పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ



కూనవరంలో పూజలు చేస్తున్న భక్తులు

అనంతరం కోదండ రామాలయంలో సీతారామచంద్రలు వారికి పూజాధికాలు నిర్వహించారు. ఏకాహ మహోత్సవాన్ని ప్రారంభించారు. శనివారం ఉదయం 5 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. పవనగిరి క్షేత్రంలో శ్రీ బాలాజీ దేవాలయంలో స్వామి వారి ఉత్తర ద్వారా దర్శనాలు జరిపారు. పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పురోహితుడు అయ్యప్పశర్మ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



సీలేరులో ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

కూనవరం: మండల కేంద్రంలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో భక్తులకు ఉత్తరద్వారం దర్శన ప్రవేశం కల్పించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామివారు, జడ్డంగిలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీలేరు: స్థానిక రామాలయంలో ఉత్తర ద్వారం నుంచి భక్తుల దర్శనాలు చేసుకున్నారు. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం కోలాట ప్రదర్శన, దీపారాధన నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

డుంబ్రిగుడ: గ్రామాల్లో వ్యాధులు సోకిన వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రాంబాబు తెలిపారు. పోతంగి పంచాయతీ పెద్దపాడు, గుంటగన్నే పంచాయతీ లక్క గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో భాగంగా ఆ గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతన్న వ్యాధిగ్రస్తుల ఇంటింటికీ వెళ్లి వైద్యాధికారి వైద్య సపర్యాలు చేశారు. పెద్దపాడు శిబిరంలో 45 మంది, లక్క గ్రామంలో 47 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ శీతాకాలం కావడంతో చలి మంచు ఎక్కువగా ఉందని జలుబు, దగ్గు వంటి లక్షణాలు వస్తాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. హెల్త్ అసిస్టెంట్ స్వామి, రవీంద్ర, ఏఎన్ఎం కిరణ్మై, భానుమతి, విజయలక్ష్మి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్క గ్రామంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



పెద్దపాడులో గిరిజనులతో మాట్లాడుతున్న వైద్యాధికారి రాంబాబు

భూకబ్జాలు అరికట్టేందుకు చర్యలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు మేజర్ పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ జి.శారద ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతమైన అరకులోయలో అనేక భూములు కబ్జాలకు గురవుతున్నాయని, అరికట్టేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వరాలమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపో ఏర్పాటుకు దరఖాస్తులు

రంపచోడవరం: రంపచోడవరం డివిజన్‌లో రేషన్ డిపో ఏర్పాటుకు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా నియమిస్తామన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య పనులు

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని పర్యాటక ప్రాంతాల్లో ఈనెల 12న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ కన్నా పర్యటించనున్న నేపథ్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు ఎంపీడీవో కుమార్ చెప్పారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ పనులు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా అరకులోయ నుంచి అనంతగిరి మండలం టీసుపురం మీదుగా బొర్రా గుహల ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం బొర్రా పంచాయతీ నిన్ని మామిడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, నిర్వహణ తీరును టీచర్ కొర్రా పద్మినికి అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ లేకపోవడంపై టీచర్‌కు హెచ్చరించిన ఎంపీడీవో భవిష్యత్‌లో రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ సీతయ్య, కార్యదర్శి ధర్మ, టూరిజం మేనేజర్ గౌరీ శంకర్ తదితరులున్నారు.



పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న ఎంపీడీవో కుమార్

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

రంపచోడవరం: పోలవరం నిర్వాసితులకు గోకవరం మండలం రాజుపాలెంలో నిర్మించిన కాలనీలో కొంత మంది ఇళ్ల పట్టాల ఇచ్చారని వాటిలో మౌలిక వసతులు కల్పించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీని నిర్వాసితులు శుక్రవారం కలిసి కోరారు. 80 మంది నిర్వాసితులకు పట్టాలు ఇచ్చారని వాటిలో రోడ్లు, కుళాయిలు సౌకర్యం కల్పించాలని కోరారు. కాలనీలో 18 గ్రామాలకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన 60 నిర్వాసితులున్నారని వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ కల్పశ్రీ సానుకూలంగా స్పందించినట్లు దేవీపట్నం మాజీ ఉప సర్పంచ్ పోలిశెట్టి శివరామకృష్ణనాయుడు తెలిపారు. ఈ నెలలో కాలనీకి వచ్చి నిర్వాసితులతో మాట్లాడతానని ఆమె హామీ ఇచ్చినట్టు తెలిపారు.



రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీకు సమస్యలు వివరిస్తున్న నిర్వాసితులు

తాగునీటి సమస్యపై గ్రామస్తుల ఆందోళన

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఆందోళనకు దిగారు. సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో గ్రామ మహిళలు బైఠాయించారు. గ్రావంలో తాగునీటి సమస్య తీర్చాలని పలు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్య ఉందన్నారు. గ్రామంలో ఏర్పాటుచేసిన బోరు వెల్ ఉన్నా మోటర్ బిగించకపోవడంతో నీటి సరఫరా జరగడం లేదన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విశ్రాంత ఎంఈవో తమ్మిరాజు సూచించారు. తిమ్మరాజుపేటలోని అంతర్జాతీయ డావెన్సీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డావెన్సీ ఉత్సవ్‌లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు సత్ప్రవర్తన అలవాటు చేసుకోవాలన్నారు. స్కూల్ ఎండీ కర్రి సుందరయ్య, డైరెక్టర్ రమణాజీ, హెచ్ఎం మిశ్ర, వైద్యులు రామమూర్తి, యశ్వంత్ కుమార్, సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, కేవీ రమణ, కేఎస్‌వీ సత్యనారాయణ, అప్పారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సేవతోనే ఆనందం

ముంచంగిపుట్టు: మన్యంలోని పేద గిరిజన యువత అభ్యున్నతి కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు. మండల కేంద్రంలోని ఆదివాసీ విద్యా ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేవతోనే సంపూర్ణ ఆనందం పొందవచ్చన్నారు. సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.